క్లుప్తంగా

బాలల సమస్యలపై సమాచారం ఇవ్వండి



అవగాహన కల్పిస్తున్న చైల్డ్‌లైన్ సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పిల్లల హక్కులకు భంగం కలిగినట్లు గుర్తిస్తే వెంటనే 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని చైల్డ్‌లైన్ సిబ్బంది సతీశ్, హరీశ్ అన్నారు. పెద్దపల్లి మండలం అందుగులపల్లిలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒంటరి పిల్లలు, అనాథలైన బాలలు, బాల్యవివాహాలు లాంటి సమస్యలపై సమాచారం అందించాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం 1098కు సమాచారం అందించాలన్నారు. సర్పంచ్ కారె శారద, నాయకుడు శ్రీనివాస్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మి

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన గోస్కుల అఖిలకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.48వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును సోమవారం ఎంపీపీ రాసకొండ లక్ష్మి అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాసకొండ చందు, దండె కిషన్ బొల్లపల్లి శంకర్‌గౌడ్, జంగిలి అంజి, గోస్కుల సమ్మక్క, రాసకొండ రవి, పిట్టల స్వామి, సాన సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

కమాన్‌పూర్: కాళేశ్వర శ్రీముక్తీశ్వరస్వామి మున్నూరుకాపు ఆధ్వర్యంలో 14న కాళేశ్వరంలో నిత్యాన్నదాన సత్రం భూమిపూజ ఆహ్వాన పోస్టర్‌ను కాళేశ్వరం ట్రస్టు బోర్డు సభ్యులు ముకుంద అనిల్ పటేల్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. మండలంలోని మున్నూర్‌కాపు కులబాంధవులు హాజరుకావాలని కోరారు. సర్పంచ్ నీలం సరిత, ఎంపీటీసీ బోనాల వెంకటస్వామి, ఆకుల బాపు, కొట్టె భూమయ్య, బోనాల సత్యం, సుంకు వెంకటేశ్వర్లు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజలో పాల్గొనండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సత్రం ట్రస్టు సభ్యులు

మంథని: కాళేశ్వర ముక్తీశ్వర స్వామి నిత్య అన్నదాన సత్రం భూమిపూజ మహోత్సవం 14న నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో మున్నూరుకాపు సామాజిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని సత్రం సభ్యులు కోరారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ముత్తారంలో ఆవిష్కరించారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి



భక్తులకు దర్శనమిచ్చిన అష్టభుజ గణపతి

మంథని: సంకటహర చతుర్థి సందర్భంగా సోమవారం మంథనిలోని అష్టభుజ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంథనితో పాటు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

దేవాలయానికి మైక్‌సెట్ వితరణ

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లి గ్రామంలోని బీరప్పస్వామి ఆలయానికి బీజేపీ నాయకులు ఏగోలపు సదయ్యగౌడ్ సోమవారం మైక్‌సెట్ అందజేశారు. కురుమ సంఘం నాయకులు రాజమల్లు, రాజ్‌కుమార్, పోచమల్లు, ప్రవీణ్ ఉన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరుకున్న బస్టాండ్
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- చోరీకి గురైన కిటికీలు, తలుపులు
- వినియోగంలోకి తేవాలని కోరుతున్న మండల ప్రజలు



శిథిలావస్థలో కాల్వశ్రీరాంపూర్ బస్టాండ్

కాల్వశ్రీరాంపూర్: దశాబ్దాల కిందట రూ.లక్షలు వెచ్చించి కాల్వశ్రీరాంపూర్ బస్టాండ్ నిర్మించారు. కానీ ప్రారంభించకుండానే వదిలివేశారు. అనంతరం ఎవరూ ఈ బస్టాండ్ వైపు కన్నెత్తి చూడలేదు. నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. బస్టాండ్ కిటికీలు, తలుపులు చోరీకి గురయ్యాయి. షట్టర్లు సైతం ఎత్తుకెళ్లేందుకు విఫలయత్నం చేశారు. అప్పటి కాంట్రాక్టర్ పి.కేశవరెడ్డి దీని నిర్మాణం ఓ సవాలుగా తీసుకుని నాణ్యత ప్రమాణాలు పాటించి పూర్తి చేశాడు. నాడు ఊరి చివర ఉన్న ఈ బస్టాండ్ నేడు పెరిగిన జనాభాతో చుట్టూ జనావాసాలతో గ్రామం మధ్యలో చేరింది.

ప్రయాణికులకు తప్పని తిప్పలు..

పశువుల నిలయంగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుంది. బస్టాండ్ లేక ప్రయాణికులు చెట్ల కింద నిలబడుతున్నారు. ప్రస్తుతం ఎండల ప్రభావంతో ప్రయాణికులు అనేక తిప్పలు పడుతున్నారు. వర్షాకాలంలో వానకు తడిసి ఇబ్బంది పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా బస్టాండ్‌కు మరమ్మతు చేపట్టి, చుట్టూ చదును చేసి బస్సులు నిలిచేలా చేయాలని, ప్రయాణికులకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బస్టాండ్ వద్ద బస్సులు ఆపాలి



ఆర్టీసీ బస్సులు బస్టాండ్ వరకు వచ్చి ప్రయాణికులను చేరవేయాలి. రూ.లక్షలు వెచ్చించి కట్టిన బస్టాండ్ అక్కరకు రాకుండా పోతోంది. మహిళలు, వృద్ధులు, గర్భిణులు బస్సు ఎక్కాలంటే ఇబ్బంది పడుతున్నారు. బస్టాండులో బస్సులు ఆగేలా పెద్దసార్లు చర్యలు తీసుకోవాలి.

– చిలువేరు లింగయ్య, పెద్దంపేట, సింగరేణి రిటైర్డ్ కార్మికుడు

వినియోగంలోకి తీసుకురావాలి



చీకటి పడిందంటే చాలు బస్టాండ్ పక్క నుంచి వెళ్లాలంటే ఈప్రాంత ప్రజలు భయపడుతున్నారు. మద్యం తాగే వాళ్లకు బస్టాండ్ అడ్డాగా మారింది. చుట్టుపక్కల మహిళలు జంకుతున్నారు. బస్టాండ్ కట్టి వదిలిదేసింద్రు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకుని బస్టాండ్‌కు బస్సులు వచ్చేలా

– జి.పోచాలు, బ్యాంకు ఉద్యోగి, కాల్వశ్రీరాంపూర్

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: అకస్మాత్తుగా జరిగే అగ్ని ప్రమాదాల నుంచి కాపాడుకునేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై కనీస అవగాహన కలిగి ఉండాలని ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి శివారు బందంపల్లిలోని ఫంక్షన్‌హాల్ లో సోమవారం అగ్ని ప్రమాదాలను నియంత్రించే పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినట్టు గమనించిన వెంటనే అందుబాటులో ఉన్న పరికరాలతో మంటలను అదుపు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది మహేందర్‌రెడ్డి, చంద్రయ్య, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయండి



మాట్లాడుతున్న సెగ్గెం రాజేశ్

మంథని: మండలంలోని ధర్మారం గ్రామంలో అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణంవెంటనే పూర్తి చేసి అర్హులకు అందించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్ డిమాండ్ చేశారు. కాగా సోమవారం రాజేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా చైర్మన్ ముస్కుల సురేందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ మంథని డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, ధర్మారం గ్రామ అధ్యక్షుడు పుల్ల రవి, నాయకులు సమత సదయ్య, గడ్డం రాజాగౌడ్, కొయ్యల దేవేందర్, గొల్లపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



జెండా ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్‌గౌడ్



వార్షిక వేడుకల్లో సంఘం నాయకులు

సుల్తానాబాద్: గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర నాయకుడు, తాళ్లపల్లి ఆగయ్య ఫౌండేషన్ చైర్మన్ తాళ్లపల్లి మనోజ్‌గౌడ్ కోరారు. పట్టణంలోని శ్రీరాంపూర్ క్రాస్‌రోడ్ వద్ద సర్వాయి పాపన్న మోకుదెబ్బ సంక్షేమ సంఘం మొదటి వార్షిక వేడుకల సందర్భంగా మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ సోమవారం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బండారి లక్ష్మణ్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు అనిల్‌గౌడ్, యూత్ మండల ఉపాధ్యక్షుడు దాసరి సంతోష్‌గౌడ్ నాయకులు మాచర్ల నవీన్‌గౌడ్, మూల రవీందర్‌గౌడ్, జాగిరి సత్యనారాయణగౌడ్, జక్కుల విష్ణు గౌడ్, దాసరి అరవింద్ గౌడ్, సీపతి అజయ్‌గౌడ్ ఉన్నారు.

కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో..

కమాన్‌పూర్: కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంక్షేమ సంఘం ప్రథమ వార్షిక వేడుకలను సోమవారం జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. పొన్నం వెంకన్నగౌడ్, వెంగళి రాజయ్య, రంగు సత్యనారాయణ, కమ్మగోని చెల్మయ్య, నగునూరి నర్సయ్య, జెమినిగౌడ్, విజయ్, వడ్లకొండ తిరుపతి, ముక్కెర సతీశ్, కెక్కర్ల అశోక్, రాములు, సారయ్య పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు

సుల్తానాబాద్‌రూరల్: సర్వాయి పాపన్న మోకుదెబ్బ సంక్షేమ సంఘం మొదటి వార్షిక వేడుకలను సుల్తానాబాద్ మండలం తొగర్రాయి, నారాయణరావుపల్లి గ్రామాల్లో సోమవారం సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. సంఘం నాయకులు గడ్డం అనిల్‌గౌడ్, కొమురయ్య, అంజయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్యగౌడ్ పాల్గొన్నారు.

కనులపండువగా హనుమాన్ శోభాయాత్ర



హనుమాన్ శోభాయాత్రలో బీజేపీ నాయకులు



గంగారం గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర

ఓదెల: మండలంలోని కనగర్తి గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర సోమవారం కనుల పండువగా నిర్వహించారు. హనుమాన్ శోభాయాత్రలో భాగంగా భక్తాంజనేయస్వామిని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా గీతాలు ఆలపిస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దాసరి హన్మయ్య, నాయకులు ఏగోలపు సదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గంగారంలో..

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని గంగారం గ్రామంలో సోమవారం హనుమాన్ భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ ఆలయం నుంచి భజనలు కీర్తనలతో ఊరేగింపు నిర్వహించారు.

హనుమాన్ మాలధారులకు బిక్ష

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం హనుమాన్ మాలధారణ స్వాములకు సర్పంచ్ దారబోయిన నర్సింహయాదవ్ బిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మొగురం రమేశ్, స్వాములు మేర శ్రీనివాస్, వేణు, బండి రాజయ్య, శ్రీనివాస్, చుక్క స్వామి, చింతమల్ల రాములు ఉన్నారు.

నవనిర్మాణ సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు



సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో నిర్వహించిన బహిరంగ సభకు ఆర్జీ–2 టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో సోమవారం యైటింక్లయిన్‌కాలనీ నుంచి దాదాపు 500 మంది టీబీజీకేఎస్ నాయకులు కాలనీలో బైక్‌పై ర్యాలీ నిర్వహించి సభకు బయలుదేరి వెళ్లారు.

పాలకుర్తి మండలం నుంచి..

పాలకుర్తి: గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సోమవారం నిర్వహించిన రామగుండం నవనిర్మాణ సభకు పాలకుర్తి మండల పరిధిలోని గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. బసంత్‌నగర్, పాలకుర్తి, కొత్తపల్లి, ఈసాలతక్కళ్లపల్లి, పుట్నూర్, జయ్యారం, కుక్కలగూడుర్, వేంనూర్ తదితర గ్రామాల నుంచి దాదాపు 1000 మంది వరకు ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు.

అంతర్గాం మండలం నుంచి..

రామగుండం: గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నవనిర్మాణ సభకు అంతర్గాం మండల పరిధిలోని గ్రామాల నుంచి తరలివెళ్లారు.

వార్డు సమస్యలు పరిష్కరించండి



పుష్పగుచ్ఛం ఇస్తున్న రాధ

సుల్తానాబాద్: పట్టణంలో వార్డు సమస్యలకు నిధులు మంజూరు చేసి పరిష్కరించాలని కోఆప్షన్ సభ్యురాలు మాంగని రాధ శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ తానిపర్తి భానుప్రసాద్‌రావును కలిసి విన్నవించారు. కరీంనగర్ అతిథి గృహంలో సోమవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. భానుప్రసాద్‌రావు సానుకూలంగా స్పందించారని బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్ తెలిపారు.

11వ రోజుకు చేరిన జూనియర్ కార్యదర్శుల సమ్మె



సమ్మెకు మద్దతు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

కమాన్‌పూర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె సోమవారం 11వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా మంథని డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల పరిధిలోని కార్యదర్శులు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. మండలంలోని ప్రజాప్రతినిధులు సమ్మెకు మద్దతు తెలిపారు. ఆయా మండలాల సంఘం అధ్యక్షులు ప్రశాంత్, వేణు, ఆకాష్, తిరుపతి పాల్గొన్నారు.

అన్నదానం అభినందనీయం



అన్నదానం చేస్తున్న ఎంపీపీ బాలాజీరావు


సుల్తానాబాద్: దివ్యాంగులకు అన్నదానం చేయడం అభినందనీయమని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో ఆచార్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొన్నారు. ఎంపీడీవో శశికళ, ఏపీఎం శ్రీనివాస్, మండల విద్యాధికారి సురేందర్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ఆచార్య ఫౌండేషన్ సభ్యులు కొమిరిషెట్టి లావణ్య–రమేశ్, ప్రేమ్‌చందర్‌రావు, ఆచార్య ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ జవ్వాజి రాజేశ్, కనుకుంట్ల శోభ, కొమిరిశెట్టి రమేశ్, లావణ్య, ప్రపూర్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిత్ర కథ: బ్లడ్ శాంపిల్స్ సేకరణకు తిప్పలు



కోల్‌సిటీ: రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కొత్తగా ప్రారంభించిన 85 పడకల ఓపీ బ్లాక్‌లో బ్లడ్, యూరిన్ పరీక్షల నిమిత్తం పేషెంట్లు శాంపిల్స్ ఇవ్వడానికి తిప్పలుపడుతున్నారు. ప్రత్యేక గదిలో ఏర్పాటు చేయకుండా, రిసెప్షన్ కౌంటర్ దగ్గరే శాంపిల్స్ సేకరణ చేస్తుండడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. సరైన ప్రణాళిక ప్రకారం శాంపిల్స్ సేకరించకపోవడంపై పేషెంట్లు అసహనం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఇబ్బందులు తొలగించాలని వారు కోరుతున్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా



ట్రాక్టర్‌లో ఇసుక అక్రమ రవాణా

జ్యోతినగర్: ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలో పెరుగుతున్న ఇళ్ల నిర్మాణం కోసం ఇసుక అవసరం కాగా అంతర్గాం గోదావరి నది నుంచి రాత్రివేళల్లో అక్రమార్కులు ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రెండురోజుల క్రితం నంబర్ ప్లేట్లు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న సమాచారంతో సాండ్ రీచ్ అధికారి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం మరువక ముందే అంతర్గాం గోదావరి నుంచి లింగాపూర్ మోడల్ స్కూల్ దారి ద్వారా ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి ఇసుక తరలిస్తుండగా స్థానికంగా ఉన్న సాండ్ ట్యాక్సీ ట్రాక్టర్ యజమానులు వే బిల్లు లేకుండా ఎలా రవాణా చేస్తారని నిలదీశారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని, ఇళ్ల నిర్మాణదారులు అధిక ధరలు చెల్లించాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు.

విరబూసిన 'మే' పుష్పం



జ్యోతినగర్: అందమైన 'మే' పుష్పం విరబూసింది. రామగుండం కార్పొరేషన్ ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణ కాలనీలోని యాదగిరిగౌడ్ ఇంట్లో సోమవారం మేలో పుష్పించే 'మే' పుష్పం వికసించింది. సంవత్సరానికి ఒకసారి విరబూసే ఈ పుష్పాన్ని పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

✦ కంటివెలుగులో 153మందికి పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగులో భాగంగా సోమవారం 153మందికి కంటి పరీక్షలు నిర్వహించి 13మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. సర్పంచ్ పెద్దోళ్ల ఐలయ్య, ఎంపీటీసీ నారగోని ఎల్లవ్వ, ఉపసర్పంచ్ చీకటి శైలజ, మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా, క్యాంపు మెడికల్ ఆఫీసర్ స్వప్న పాల్గొన్నారు.

✦ శివాలయంలో రుద్రాభిషేకం

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. ఆలయ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, అల్లంకి ఆనందం, నగునూరి అశోక్, చకిలం మారుతి, ఐతు రమేశ్, కోటయ్య, కొమురవెల్లి వీరభద్రయ్య, మితులా కుమారి, అల్లంకి అశోక్, అర్చకులు క్యాసునూరి భద్రయ్య, మహేశ్–రాజేశ్వరి, శ్రీనివాస్–పద్మ ఉన్నారు.

✦ అదనపు తరగతి గది నిర్మాణం కోసం భూమిపూజ

కమాన్‌పూర్: మండలంలోని సిద్దిపల్లె ప్రభుత్వ పాఠశాలలో రూ.5.06లక్షలతో నిర్మించే అదనపు తరగతి గది నిర్మాణం కోసం సోమవారం ఎంపీపీ రాసకొండ లక్ష్మి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. సర్పంచ్‌లు తాటికొండ శంకర్, బొల్లపెల్లి శంకర్‌గౌడ్, ఎంపీటీసీలు బోనాల వెంకటస్వామి, కోలేటి చంద్రశేఖర్, ఉపసర్పంచ్ జాబు సతీశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై గ్రామస్తుల ఆగ్రహం



బియ్యం పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

మంథని: ముత్తారం మండలం సీతంపేటలో రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసే సన్న బియ్యంలో దొడ్డువి కలిపి లబ్ధిదారులకు పంపిణీ చేయడంతో వారు డీలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై డీలర్ తీరు సరిగ్గా లేకపోవడంతో లబ్ధిదారులు సోమవారం స్థానిక సర్పంచ్ పులిపాక నగేష్, ఎంపీపీ జక్కుల ముత్తయ్య దృష్టికి తీసుకెళ్లారు. వారు అక్కడికి వచ్చి బియ్యం పరిశీలించగా సన్నబియ్యంలో దొడ్డువి కలిసినట్లుగా గుర్తించారు. తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు.